RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్: చెరుకు ఉపేందర్ | శనివారం 19 అక్టోబర్ 2024

సంపుటి: 2 | సంచిక: 159 | పేజీలు: 4 | వెల: రూ.5/-

## 2027లో జమిలి ఎన్నికలు!



న్యూఢిల్లీ, అక్టోబర్ 18 (ప్రభాత సూర్యుడు): భారతదేశం మొత్తం ఒకేసారి 2027 ఫిబ్రవరిలో ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో ఎన్నికలు (జమిలి) నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధం అవుతుంది. జమిలి ఎన్నికలకు మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ కూడా పూర్తిస్థాయిలో పరిశీలన జరిపి తన నివేది కను కేంద్ర ప్రభుత్వానికి అందజేసింది. జమిలి ఎన్నికలు జరగాలి అంటే రాజ్యాంగంలో ఐదు ఆర్టికల్స్ (ఆర్టికల్ 83, 85, 172, 174, 356)లు రాజ్యాంగ సవరణ బిల్లు ద్వారా చేయాలని సూచించింది. ఈ బిల్లు పాస్ అవ్వాలి అంటే లోక్ సభ, రాజ్యసభలో 67 శాతం మంది సపోర్ట్ చేయాలని అని, 14 రాష్ట్రాలు అసెంబ్లీలు సపోర్ట్ చేయాలని, అలా మద్దతు ఇస్తే బిల్లు రాజ్యాంగ పరిధిలోకి వస్తుందని కమిటీ తెలిపింది. కాగా, ఈ బిల్లు 024 ఈ శీతాకాల సమావేశాల్లోనే పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ఈ బిల్లుకు పార్లమెంట్ లో మద్దతు లభిస్తే 2027 ఫిబ్రవరిలో ఉత్తర ప్రదేశ్ ఎన్నికలతో పాటు దేశం మొత్తం అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు నిర్వహిస్తుంది. ఈ ఎన్నికలు జరిగిన 100 రోజుల తర్వాత మున్సిపల్, గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తుంది. దేశం మొత్తం పరిపాలన సౌలభ్యం కొరకు ఈ జమిలి ఎన్నికలు జరపనున్నట్టు కేంద్ర మంత్రి ప్రహ్లాద ఘోషి తెలిపారు.

## సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలతో..

# బీజేపీ, బీఆర్ఎస్‌లు ఆగమాగం.. గందరగోళం

### ప్రభాత సూర్యుడు దినపత్రిక చీఫ్ ఎడిటర్ కస్బా శంకర్రావు ప్రత్యేకం

- బుధవారం సీఎం రేవంత్ రెడ్డి ప్రెస్ మీట్‌తో "ఆగమాగం-గందరగోళం" అయిన బి.ఆర్.ఎస్, బిజెపి పార్టీలు!!!!
- ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ ఉమ్మడి నల్లగొండ జిల్లాల ప్రజలకు మంచి రోజులు రానున్నాయి!!!!
- బిజెపి ఈటెల రాజేందర్, బి ఆర్ ఎస్ కేటీఆర్, తన్నీరు హరీష్ రావు లకు సీఎం రేవంత్ రెడ్డి చెక్!!!!
- మూసీనది పునః ప్రక్షాళన, దామగుండం దేశ రక్షణకు చెందిన నేవీ రాడార్ స్టేషన్ ఈ రెండు ప్రాజెక్టులు తన డ్రీమ్ ప్రాజెక్టులు అన్న సీఎం రేవంత్ రెడ్డి!!!!
- తొందరలో అన్ని పార్టీల అధ్యక్షులతో, పత్రికల సంపాదకులతో రౌండ్ టేబుల్ సమావేశం!!!!
- బిజెపి అధ్యక్షుడు కిషన్ రెడ్డి, బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర రావు, వామపక్షాల పార్టీల అధ్యక్షులు, ఎం ఐ ఎం పార్టీ అధ్యక్షుడికి ప్రభుత్వపరంగా అఖిలపక్షం సమావేశానికి ఆహ్వానాలు!!!!
- అఖిలపక్ష సమావేశంలో ఇండ్లు కోల్పోతున్న బాధిత కుటుంబాలకు ఖచ్చితమైన భరోసా, సొంత పక్క ఇల్లు!!!!







హైదరాబాద్, అక్టోబర్ 18 (ప్రభాత సూర్యుడు): గురువారం తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రెస్ మీట్ లో మూసీనది ని పునః ప్రక్షాళన చేస్తున్నామని, సుందరీకరణ కాదని, కుండ బద్దలు కొట్టినట్టు, చెప్పడంతో, బి ఆర్ ఎస్, బిజెపి పార్టీల నాయకులు దిమ్మరపోయి, కార్య కర్తలకు ఏమి చెప్పాలో ఎటు తోయక "ఆగమాగం, గందరగోళం" అవుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. సీఎం రేవంత్ రెడ్డి ఇంకొక అడుగు ముందు కేసి మూసి గర్భంలో, మురికి కంపులో మునిగిపోతున్న ప్రజలను ఆదుకోవడం తప్పా??? అని బిజెపి, బి.ఆర్.ఎస్ పార్టీలను కార్నర్ చేసి ఆయా పార్టీలను ఇరకాటంలో పడేశారు. అసలు మూసీనది ఈ దుస్థితి కి కారణం ఈ పార్టీలే కదా!!! అని ఎదురు ప్రశ్న వేయడంతో దిక్కుతోచని స్థితిలో ఆయా పార్టీలు పడిపోయాయి. పార్టీ పరంగా, ప్రభుత్వం పరంగా, మూసీనదిని పునః ప్రక్షాళన చేయాలని దృఢ సంకల్పంతో ముందుకు పోతుంటే హర్షించేది పోయి, ప్రజలను అయోమయంలో పడేస్తున్నారని అన్నారు. హైదరాబాద్ మహానగరంలో అకాల వర్షాలు వస్తే వరద నీరు, మురికి నీరు వెళ్లడానికి దారులన్నీ మూసేసి చెరువులను, కుంటలను, నాళాలను అక్రమంగా కబ్జాలు చేసి భవనాలు నిర్మించి వరద నీరు సాఫీగా పారే పాయలను కమ్మేసారని అన్నారు. దూరదృష్టితో తమ ప్రభుత్వం కబ్జాదారుల భర్తం పట్టాలని అట్టి అక్రమ కట్టడాలను తొలగించాలనే హైడ్రాను ఏర్పాటు చేశామని, అందుకు స్ట్రిక్ట్ ఆఫీసర్ గా పేరు తెచ్చుకున్న ఐపీఎస్ రంగనాథ్ ను నియమించామని తెలిపారు. గత పది సంవత్సరాల కెసిఆర్ ప్రభుత్వ హయాంలో జరిగిన విధ్వంసాన్ని చక్కదిద్దుతూ పాలన సాగిస్తూ ఉంటే ప్రజల నుండి తమకు మంచి పేరు వస్తుంటే!!! అది జీర్ణించుకోలేక!! ప్రజలకు తప్పుడు లెక్కలు, తప్పుడు సమాచారం ఇస్తూ ఇంకా ప్రజలలో చులకన అవుతున్నారని అన్నారు. హైడ్రాను వ్యతిరేకించే బిజెపి నాయకుడు ఈటెల రాజేందర్, బి ఆర్ ఎస్ నాయకులు కల్వకుంట్ల కేటీఆర్, హరీష్ రావులు బుల్డోజర్లకు అడ్డుపడతామని, అడ్డుకుంటామని, ప్రజలను రెచ్చగొడుతూ పబ్బం గడుపుకుంటున్నారని అన్నారు. నిజంగా ఈ ముగ్గురికి మూసిని ప్రక్షాళన చేయాలని సంకల్పం ఉంటే కల్వకుంట్ల కేటీఆర్,

..మిగతా 2లో







## అపరిచితుడిలా మాట్లాడుతున్న రేవంత్




మూసీపై రోజుకో మాటతో ప్రజల్లో గందరగోళం
మూసీని మురికికూపంగా చేసిన ఘనత కాంగ్రెస్‌దే
మూసీలో వరదలు వచ్చినా..నీళ్లునిలిచే ప్రసక్తే లేదు
పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన కెటిఆర్

హైదరాబాద్, అక్టోబర్ 18 (ప్రభాత సూర్యుడు): మూసీ సుందరీకరణపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రోజుకో మాట మాట్లాడుతూ.. అపరిచితుడిలాగా మారిపోయాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. మూసీ సుందరీకరణ చేస్తాం అని మొట్టమొదట చెప్పిందే రేవంత్ రెడ్డి.. కానీ నిన్న ప్రెస్ మీట్లో అసలు సుందరీకరణ మాట ఎక్కడి నుంచి వచ్చిందని అంటున్నాడని కేటీఆర్ ఫైర్ అయ్యారు. తెలంగాణ భవన్‌లో మూసీపై కేటీఆర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రేవంత్ రెడ్డి ఒక రోజు సుందరీకరణ అంటాడు.. మరొక రోజు ప్రక్షాళన అంటాడు.. మరో రోజు పునరుజ్జీవం అంటాడు అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. మూసీ సుందరీకరణ అనే మాట మొట్టమొదటు వాడింది రేవంత్ రెడ్డి. గోపన్‌పల్లిలో మాట్లాడుతూ లక్షన్నర కోట్లతో మూసీ సుందరీకరణ చేస్తామని చెప్పారు. కానీ ఇవాళ ఆయన ఒక అపరిచితుడిలా మారారు. ఆయన నోట్లో నుంచి అబద్దాలు వస్తున్నాయి. లక్షన్నర కోట్లు ఎవరు అన్నారని అంటుండు. నల్లగొండకు మంచినీళ్లు ఇస్తుంటే మీకు మనసున పడుతలేదా అంటున్నాడు. నల్లగొండ జిల్లా ప్రజలను రెచ్చగొడుతున్నాడని కేటీఆర్ ధ్వజమెత్తారు. మూసీ ప్రక్షాళన ఇష్టం లేదని మీరంటే ఖర్చు పెట్టిన రూ. 140 కోట్లు నా ఆస్తి అమ్మైన కడుతా అని రేవంత్ రెడ్డి అంటున్నాడు. రేవంత్ రెడ్డి అఫిడవిట్‌లో ఏమో రూ. 30 కోట్లే తన ఆస్తి అని చూపించాడు. మరి రూ. 140 కోట్లు తమ్ముడి స్వచ్ బయో కంపెనీ నుండి తేస్తాడా, బావమరిది అమృత్ కంపెనీ నుండి అమృతం ఏమైనా జుర్రుతాడా? అని కేటీఆర్ విమర్శించారు. మూసీ మురికి కూపంగా మారిందన్న సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలతో ఏకీభవిస్తున్నా.. మూసీని మురికి కూపంగా మార్చింది కచ్చితంగా గత పాలకులే.. అందులో సింహభాగం కాంగ్రెస్ ప్రభుత్వానిది అయితే.. కొద్దిభాగం టీడీపీ ప్రభుత్వానికి కూడా దక్కుతుందని కేటీఆర్ పేర్కొన్నారు. మూసీ స్టోరీ ఏంటని ఆలోచిస్తే.. మూసీ నది కృష్ణానదికి ఉపనది. పైన అనంతగిరి కొండల్లో ముచ్కుంద వద్ద మూసీ ఉద్భవించింది. 267 కి.మీ.

..మిగతా 2లో

## రేవంత్ కుర్చీకి ఎసరు

### హైడ్రా, మూసీ, గ్రూప్-1 విషయాల్లో జాగ్రత్త

#### కేంద్రమంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు




కరీంనగర్, అక్టోబర్ 18 (ప్రభాత సూర్యుడు): సిఎం రేవంత్ కుర్చీకి ఎసరు పెడుతున్నారు.. హైడ్రా, మూసీ, గ్రూప్-1 విషయాల్లో జాగ్రత్త పడాలి..అంటూ కేంద్రమంత్రి బండి సంజయ్ సచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌ను పదవి నుంచి దింపేందుకు కాంగ్రెస్‌లోని కొందరు మంత్రులు ప్రయత్నిస్తున్నారని కేంద్రమంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సీఎం పీఠం నుంచి దించాలని కాంగ్రెస్ మంత్రులు చూస్తున్నారని షాకింగ్ కామెంట్స్ చేశారు. గోతికాడ నక్కలా రేవంత్‌ను దింపేయాలని కుట్ర చేస్తున్నారని అన్నారు. హైడ్రా, మూసీ, గ్రూప్-1 విషయంలో జాగ్రత్త పడకపోతే.. రేవంత్ రెడ్డికు చిక్కులు తప్పవని బండి సంజయ్ అన్నారు. జనంలో రేవంత్‌కు వ్యతిరేకత రావాలని కాంగ్రెస్ ప్రభుత్వ మంత్రులే చూస్తున్నారని అన్నారు. గ్రూప్-1 అభ్యర్థుల మీద దాడులు చేయడం దారుణమని చెప్పారు. గ్రూప్-1 అభ్యర్థులు చేసిన తప్పేంటీ అని

..మిగతా 2లో

## సుప్రీం చరిత్రలో మరో కొత్త అధ్యాయం

### కేసుల విచారణ లైవ్ స్ట్రీమింగ్‌కు యత్నం.. ప్రత్యేక యాప్ ద్వారా వీక్షించేలా ఏర్పాట్లు



న్యూఢిల్లీ, అక్టోబర్ 18 (ప్రభాత సూర్యుడు): సుప్రీంకోర్టు చరిత్రలో మరో కొత్త అధ్యాయం మొదలు కానుంది. ఇకపై సుప్రీంలో జరిగే అన్ని కేసుల విచారణను లైవ్ స్ట్రీమింగ్ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందుకోసం రూపొందించిన యాప్‌ను ప్రయోగాత్మకంగా పరీక్షించారు. ఈ క్రమంలో లోటుపాట్లను సవరించి త్వరలో అమలులోకి తీసుకురానున్నారు. ఇప్పటికే అంటే సరిగ్గా రెండేళ్ల క్రితం రాజ్యాంగ ధర్మాసనం కేసుల విచారణ ప్రత్యక్ష ప్రసారం ప్రారంభమైంది. యూట్యూబ్ వేదికగా వాటిని ప్రసారం చేస్తున్నారు. ప్రత్యక్ష ప్రసారంలో తొలి విచారణ 'సేన జం సేన' కేసుపై జరిగింది. మహారాష్ట్ర శివసేన పార్టీలో శిందే వర్గం తిరుగుబాటు, ఠాక్రే నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం

..మిగతా 2లో

## అరబ్ ఎమిరేట్ వెళ్లే వారికి శుభవార్త

### వీసా ఆన్ అరైవల్ ప్రారంభించిన ఎమిరేట్స్



న్యూఢిల్లీ, అక్టోబర్ 18 (ప్రభాత సూర్యుడు): యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు వెళ్లే భారతీయులు ఇక సులువుగా వీసా పొందవచ్చు. యూఏఈలో దిగిన వెంటనే వీసా పొందే అవకాశం అందుబాటులోకి వచ్చింది. ఇందుకోసం వీసా-ఆన్-అరైవల్ ను యూఏఈ ప్రారంభించినట్లు అక్కడున్న భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. అర్హత కలిగిన భారతీయ పౌరులు.. 14 రోజుల వ్యవధితో కూడిన వీసాను యూఏఈ ఎయిర్‌పోర్టులోనే పొందే అవకాశం ఉంటుందని తెలిపింది. వీసా-ఆన్-అరైవల్ సదుపాయానికి సంబంధించి పలు అంశాలను భారత్ రాయబార కార్యాలయం వెల్లడించింది. అమెరికా జారీచేసిన గ్రీన్ కార్డు లేదా చెల్లుబాటయ్యే వీసా, యురోపియన్ యూనియన్ దేశాలు, యూకే దేశాలు ఇచ్చిన రెసిడెన్స్, వీసాలు కలిగి ఉన్నవారు వీటిని పొందవచ్చు. పాస్‌పోర్టు కనీసం 6 నెలలు చెల్లుబాటు అయ్యేలా ఉండాలి. తొలుత 14 రోజుల వ్యవధితో కూడిన వీసా పొందవచ్చని, మరో 14రోజులు పొడిగించుకునే అవకాశం ఉంటుంది. లేదా పొడిగింపునకు వీలుకాని 60 రోజుల వ్యవధితో కూడిన వీసాను తీసుకునే వెసులుబాటు ఉంది.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



## సుప్రీం చరిత్రలో
# మరో కొత్త అధ్యాయం

**మొదటి పేజీ తరువాయి...**

కూలిపోవడం వంటి పరిణామాలపై సుప్రీంకోర్టులో అనేక పిటిషన్లు దాఖలయ్యాయి. అసలైన శివసేన తమదేనంటూ ఠాక్రే, శిందే వర్గాల మధ్య పోరు నెలకొన్న నేపథ్యంలో ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరిపింది. కేసుల విచారణలను లైవ్ స్ట్రీమింగ్ చేయడానికి అనుకూలంగా సుప్రీంకోర్టు 2018లోనే నిర్ణయం తీసుకున్నప్పటికీ.. ఆచరణలోకి రాలేదు. అయితే, భారత మాజీ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఎన్.వి.రమణ పదవీ విరమణ రోజు.. ఆయన నేతృత్వంలోని ధర్మాసనం కార్యకలాపాలను దేశ ప్రజలంతా వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. సుప్రీంకోర్టు కార్యకలాపాలను ప్రత్యక్ష ప్రసారం చేయడం అదే తొలిసారి. ఆ తర్వాత రాజ్యాంగ ధర్మాసనం విచారణలను లైవ్ స్ట్రీమింగ్ చేయాలని రెండేళ్ల క్రితం నిర్ణయం తీసుకున్నారు. ఈ చారిత్రక నిర్ణయంతో పౌరసత్వ సవరణ చట్టం, ఆర్టికల్ 370 వంటి కీలక కేసులకు సంబంధించిన విచారణల వంటివాటిని దేశ ప్రజలంతా ప్రత్యక్షంగా వీక్షించారు.

## సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలతో..
# బీజేపీ, బీఆర్ఎస్‌లు ఆగమాగం.. గందరగోళం

**మొదటి పేజీ తరువాయి...**

ఈటెల రాజేందర్, హరీష్ రావులు 3 నెలలు మూసి కంపును భరిస్తూ ఆ ప్రాంతంలో నివాసం ఉంటారా?? అని ఘాటుగా ప్రశ్నించడమే, కాకుండా అక్కడ నివాసయోగ్యమైన మూడు ఇండ్లను కూడా ఏర్పాటు చేసి, ఆ ఖర్చులను కూడా ప్రభుత్వమే, భరిస్తుందని, భోజన సదుపాయాలు సైతం ప్రభుత్వమే సమకూరుస్తుందని, అనడంతో ఈ సవాలును బిజెపి, బి ఆర్ ఎస్ నాయకులు ఎలా?? ఎదురు కోవాలో?? తెలియక, ఆయా పార్టీల క్యాడర్లకు ఏమి సమాధానం చెప్పాలో!!!?? తికమకపడుతూ, తలలు పట్టుకుంటున్నట్లు సమాచారం అందుతుంది. ఇప్పటివరకు మూసినది పునః ప్రక్షాళనకు కోటి నలభై ఒక్క లక్షలు మాత్రమే ఖర్చు చేసామని చెప్పి, ప్రతిపక్ష నాయకులకు గుండె అదిరే సమాధానం ఇచ్చారు. ఒక ఒకవైపు సుందరీకరణ అంటూ, ఇంకోవైపు లక్ష యాభై వేల కోట్లు భారీ బడ్జెట్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 25 వేల కోట్లను కమిషన్ రూపేన ప్రభుత్వం లాభ పడబోతున్నదని, భారీ కుంభకోణానికి తెర లేపుతున్నారని పదేపదే హరీష్ రావు అంటున్న మాటలకు నిప్పు తొక్కిన మనిషిలా సీఎం రేవంత్ రెడ్డి హరీష్ రావు పై విరుచుకుపడి, హరీష్ రావుకు చెక్ పెట్టి, పత్రికా సమావేశంలో పదునైన మాటలతో సీఎం రేవంత్ రెడ్డి హరీష్ రావును ఘాటుగా హెచ్చరించడంతో బి ఆర్ ఎస్ పార్టీలో ఉన్న హరీష్ రావు ఇమేజ్ ని దెబ్బతీసి, హరీష్ రావును తల దించుకునేటట్లు చేయడంలో సీఎం రేవంత్ రెడ్డి సఫలీకృతమయ్యాడు. ప్రెస్ మీట్ లో సీఎం రేవంత్ రెడ్డి మాటలను ప్రజలు ప్రత్యక్షంగా చూడడం చూశాం. ప్రపంచంలోనే అద్భుతాలు సృష్టించిన ఐదు పేరుమోసిన ఇంటర్నేషనల్ కంపెనీలకి, మూసి ప్రక్షాళన పనులు అప్ప చెప్పడానికి టెండర్లను పిలిచామని అన్నారు. అతి తొందరలో రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్ష పార్టీలైన బి ఆర్ ఎస్, బిజెపి, వామ పార్టీల తోపాటు, హైదరాబాదులో కీలకంగా ఉన్న పార్టీ ఎంఐఎం తో ఆయా పార్టీల అధ్యక్షులను పిలిచి సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అందులో వారి సూచనలు, సలహాలు తీసుకొని ఇల్లు కోల్పోతున్న బాధిత కుటుంబాలకు ఏ రకమైన సహాయం చేసి వారిని ఎలా??, ఆదుకోవాలో!!! ఆయా పార్టీల అధ్యక్షుల అభిప్రాయం తీసుకోనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలపడంతో అన్ని పార్టీల



కార్యకర్తలు సీఎం రేవంత్ రెడ్డి యొక్క పారదర్శకతను అర్థం చేసుకోవడంతో పార్టీలలో, కార్యకర్తలలో గందరగోళానికి గురి అయ్యి, పార్టీలు ఆగమాగం అవుతున్నట్లు పేరు చెప్పడానికి ఇష్టపడని బి ఆర్ ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే అనడం పార్టీలో గందరగోళం ఎలా ఉందో తెలుసుకోవడానికి ఇది ఒక చక్కటి ఉదాహరణ. వికారాబాద్ దామగుండం నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటు విషయం పై సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 2017 లోనే అప్పటి బి ఆర్ ఎస్ పార్టీ కెసిఆర్ ముఖ్యమంత్రి హయాంలోనే అన్ని పర్యావరణ అనుమతులు తీసుకొని వికారాబాద్ దామగుండం లో రాడార్ స్టేషన్ ఏర్పాటులో కెసిఆర్ కీలక పాత్ర పోషించి న విషయం దాచిపెట్టి, అధికారం కోల్పోవడంతోనే ప్రజలను గందరగోళం పరుస్తూ కేటీఆర్ దేశ రక్షణకు, దేశ భద్రతకు సంబంధించిన నేవీ రాడార్ స్టేషన్ వ్యతిరేకించడం అంటే, కేటీఆర్ అజ్ఞానం ను అర్థం చేసుకోవచ్చని, ప్రెస్ మీట్ లో సీఎం రేవంత్ రెడ్డి అన్న మాటలు ప్రజలలో బలంగా వెళ్ళిపోయాయి. దీనితో కేటీఆర్ అమెరికాలో చదివిన చదువులు ఏ పాటి ఓ అర్థం చేసుకోవచ్చని కల్వకుంట్ల కుటుంబాన్ని వ్యతిరేకించే ఓ బలమైన నాయకుడు అనడం కొసమెరుపు. ఏది ఏమైన వికారాబాద్ దామగుండంలో దేశ రక్షణ, దేశ భద్రత కోసం, శత్రు దేశాలైన చైనా, పాకిస్తాన్ లను కట్టడి చేయడం కోసం, దేశ రక్షణ శాఖకు మద్దతు ఇష్టమని అన్నారు. చైనాతో దేశానికి యుద్ధ ప్రమాదం పొంచి ఉన్న సందర్భంలో దామగుండం నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటు అవసరముందని అన్నారు. దేశ రక్షణ శాఖకు అన్ని రకాల తెలంగాణ ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. వికారాబాద్, దామగుండం (అనంతగిరి) పద్మనాభ స్వామి గుడిని కాపాడుతూ, అక్కడి అటవీ ఫారెస్ట్ బెల్ట్ ను కాపాడుతూ, అక్కడే ప్రారంభమయ్యే మూసినదికి ఎటువంటి నష్టం చేకూర్చకుండా, పర్యావరణాన్ని కాపాడుతూ, దేశ రక్షణ రంగాన్ని బలోపేతం చేయడానికి "నేవీ రాడార్ స్టేషన్" ఏర్పాటు ప్రాముఖ్యత గుర్తించి రక్షణ నేవీ అధికారులకు ప్రభుత్వపరంగా మద్దతుగా ఉంటామని తెలిపారు. కేంద్ర రక్షణ శాఖకు అన్ని రకాల మద్దతు తెలియజేస్తామని అన్నారు. దామగుండంలో ఏర్పాటు చేయనున్న దేశ రక్షణ "నేవీ రాడార్ స్టేషన్", మూసినది పునఃప్రక్షాళన తన డ్రీమ్ ప్రాజెక్ట్ లని అన్నారు. మూసి పరివాహక ప్రాంతం లోఇల్లు కోల్పోతున్న బాధిత కుటుంబాలను గుండెల్లో పెట్టుకొని, అట్టి కుటుంబాలను ఆదుకొని ఒకవైపు దామగుండం నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటు, ఇంకోవైపు మూసినది పునః ప్రక్షాళన ఈ రెండు ప్రాజెక్టులు తమ ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్టులని, సీఎం రేవంత్ రెడ్డి బుధవారం ప్రెస్ మీట్ లో అన్న మాటలు ఆయన దృఢ సంకల్పానికి నిదర్శనాలుగా చూడాలి. వికారాబాద్ అనంతగిరిలో ప్రారంభమైన మూసీనది ఉమ్మడి రంగారెడ్డి జిల్లా, గ్రేటర్ హైదరాబాదు, ఉమ్మడి నల్లగొండ జిల్లాల ప్రజలకు శుద్ధి త్రాగునీరు, సాగునీరు అందించడమే కాకుండా మూసి పరివాహక ప్రాంతాన్ని ప్రపంచంలోనే ఒక గొప్ప పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేసి చరిత్రలో కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ ఉండేటట్లు కార్యరూపం దాల్చునున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

# అపరిచితుడిలా మాట్లాడుతున్న రేవంత్

**మొదటి పేజీ తరువాయి...**

ప్రయాణం చేసి హైదరాబాద్ నగరం మీదుగా వాడపల్లి వద్ద కృష్ణా నదిలో కలుస్తుంది. 1591లో కులీకుతుబ్ షా హైదరాబాద్ నగరాన్ని మూసీ తీరాన నిర్మించారు. రెండు నదులుగా మూసా ఈసాగా ప్రారంభమై.. హైదరాబాద్‌లోని బాపు ఘాట్ వద్ద మూసీ నదిగా ఏర్పడుతాయి. గతంలో ఈ నదిని ముచ్‌కుంద అని కూడా పిలిచేవారు. 1908లో మూసీలో ఒక భయంకరమైన వరద వచ్చింది. కుంభవృష్టి లాంటి వర్షం పడడం కారణంగా అతి పెద్ద వరద సంభవించి 15 వేల మంది మరణించారు. చాలా మంది ఇబ్బంది పడ్డారు. నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ హైదరాబాద్ ప్రజలను వరద నుంచి కాపాడాలని చెప్పి.. నాటి ప్రముఖ ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను పిలిచి చర్చించారు. నాడు ఆయన డిజైన్ చేసింది ఉస్మాన్ సాగర్(గండిపేట) 1920లో పూర్తయింది, హిమాయత్ సాగర్ 1927లో పూర్తయింది. ఈ రెండింటి రిజర్వాయర్ల వెనుక ఒక ఉద్దేశం ఉంది. ఒకటి హైదరాబాద్ ప్రజలకు మంచినీరు అందించడం, రెండోది భారీగా వరదలు వచ్చిన వాటిని ఆపేందుకు, హైదరాబాద్‌లో ఆవాసాలు మునగకుండా, ప్రాణ ఆస్తి నష్టం కలగకుండా.. రక్షణ కవచం లాగా ఉండాలనే ఉద్దేశంతో ఈ రెండు రిజర్వాయర్లు నిర్మించారు. ఆ తర్వాత 95 ఏండ్ల పాటు మూసీలో ఏ ప్రభుత్వం గొప్పగా పని చేసింది లేదు అని కేటీఆర్ తెలిపారు. మూసీకి ఒక



ప్రత్యేకత ఉంది. పశ్చిమం నుంచి తూర్పు వైపునకు ప్రవహిస్తోంది. పశ్చిమాన ఉండే మంచిరేవుల వద్ద తీసుకుంటే.. ఈస్ట్‌లో ఉండే ఓఆర్ఆర్ దాకా 57.5 కిలోమీటర్లలో 84 మీటర్ల కిందకు ఫాస్ట్‌గా ప్రవహిస్తుంది. ఇది ప్రకృతి ప్రసాదించిన వరంగా చెప్పొచ్చు. వరద వేగంగా కిందకు జాలువారుతుంది. రెండోది గతంలో ఉన్న ఎంసీహెచ్, 2007-08లో ఏర్పడ్డ జీహెచ్ఎంసీ కానీ.. ఈ పరిధి తీసుకుంటే 90 శాతం రెయిన్ వాటర్, 90 శాతం సీవరేజ్ కానీ గ్రావిటీ ద్వారా మూసీలోకి వస్తుంది. 54 ప్రధాన నాలాలు ఉన్నాయి. అవన్నీ కూడా 90 శాతానికి పైగా గ్రావిటీ రూపంలో ఉన్నాయి. నాచారం, జీడిమెట్ల, బాలానగర్, మల్లాపూర్ నుంచి కొన్ని వ్యర్థాలు 90 శాతానికి పైగా మూసీలో కలుస్తున్నాయి. మూసీలో ఒక్క చుక్క నీరు వదిలినా నిల్వదు.. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ గేట్లు ఎత్తినా జరజర నీరు కిందకు పోతోంది. అలా మోక్షగుండం విశ్వేశ్వరయ్య రిజర్వాయర్లను ప్లాన్ చేశారు. ఎలాంటి ఉపద్రవం లేకుండా బ్యాలెన్సింగ్‌గా రూపొందించారు. ప్రాణ నష్టం లేకుండా కాపాడుకోవచ్చు అని చాలా ముందు చూపుతో మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ ఈ రెండు రిజర్వాయర్లను కట్టించారని కేటీఆర్ గుర్తు చేశారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చాక సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రిపోర్టు తెప్పించుకున్నాం. మూసీ మురికికూపంగా మారింది. బీవోడీ, సీవోడీ ఈ రెండింటిలో కూడా మూసీ ప్రమాదభరితమైన స్థాయిలో ఉందని రిపోర్టులో చెప్పారు. 2016 దాకా మున్సిపల్ మినిస్టర్‌గా కేసీఆర్ ఉన్నారు. ఆ తర్వాత నేను మున్సిపల్ మంత్రిగా బాధ్యతలు తీసుకున్నాను. కేసీఆర్ మార్గదర్శకత్వంలో అక్కడ ఉండే పరిస్థితులను అధ్యయనం చేసి పునరుజ్జీవం, సుందరీకరణ చేసే విధంగా సంకల్పించాం అని కేటీఆర్ తెలిపారు.



## యాదగిరిగుట్టలో భక్తులకు
# సౌకర్యాలు మెరుగు
### మంత్రి కొండా సురేఖ వెల్లడి




**హైదరాబాద్, అక్టోబర్ 18 (ప్రభాత సూర్యుడు):** యాదగిరిగుట్టలో భక్తుల సౌకర్యార్థం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకున్నామని మంత్రి కొండా సురేఖ అన్నారు. ఆలయంలో 14చోట్ల మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశామని తెలిపారు. 47 చోట్ల టాయిలెట్స్ నిర్మించినట్లు చెప్పారు. విష్ణు పుష్కరిణీ గుండాన్ని ఏర్పాటు చేశామన్నారు. చంటి బిడ్డ తల్లులకు ప్రత్యేక లాంజ్‌లు, ఎలక్ట్రిక్ వాహనాల సౌకర్యం కల్పించామని చెప్పారు. రూ. 15కోట్లతో దాతల సహాయంతో అన్నదాన సత్రం నిర్మించామని మంత్రి కొండా సురేఖ అన్నారు. 60కిలోల బంగారు తాపడంతో రాజగోపురం నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. లడ్డూ నాణ్యతలో జాగ్రత్తలు తీసుకుంటున్నామని అన్నారు. భద్రాద్రి అభివృద్ధి కోసం కొత్త మాస్టర్ ఎ÷-లాన్ సిద్ధం చేస్తున్నామని అన్నారు. రూ. 3కోట్లతో జానకి సదనం నిర్మిస్తున్నామని తెలిపారు. దేవాలయానికి సంబంధించిన 24సేవలు ఆన్ లైన్?లో అందిస్తున్నామని ప్రకటించారు. వేములవాడ దేవస్థానానికి చెందిన 850కోడెలను రైతులకు అందించినట్లు మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. టీటీడీఏకు ప్రభుత్వం రూ. 70 కోట్లు విడుదల చేసిందని ప్రకటించారు. వెండి పల్లకీలు, బంగారు తాపడం రాజగోపురం నిర్మించాలని నిర్ణయించామన్నారు. రూ.110కోట్లతో బాసర ఆలయ పునర్నిర్మానం చేస్తామన్నారు. అందుకోసం మాస్టర్ ఎ÷-లాన్ సిద్ధమైందని అన్నారు. ఆదాయం ఆధారంగా ఆలయాల వర్గీకరణ చేస్తామని వివరించారు. వివాదంలో ఉన్న దేవాదాయ, అటవీ శాఖ భూములపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని మంత్రి కొండా సురేఖ తెలిపారు.

# రేవంత్ కుర్చీకి ఎసరు

**మొదటి పేజీ తరువాయి...**

ప్రశ్నించారు. ప్రభుత్వం దుర్మార్గంగా, రాక్షసంగా వ్యవహరిస్తోందని బండి సంజయ్ ధ్వజమెత్తారు. విద్యార్థులను విచక్షణ రహితంగా కొట్టడం దారుణమని అన్నారు. ప్రభుత్వానిది చిల్లర నిర్ణయమని.. పేదల పొట్ట కొడుతారా అని బండి సంజయ్ మండిపడ్డారు. గ్రూప్-1 పరీక్ష రీ షెడ్యూల్ చేయాలని కోరారు. విద్యార్థుల బతుకులను నాశనం చేస్తారా అని నిలదీశారు. 'రాత్రంతా లాటీ చేస్తారా, మీకు కేసీఆర్‌కు తేడా ఏంటీ' అని బండి సంజయ్ ప్రశ్నించారు.15 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చి..60 వేల ఉద్యోగాలు భర్తీ చేశామంటారా.. ఇంతకంటే సిగ్గు ఉంటుందా.. కేసీఆర్ దారిలోనే మీరూ వెళ్తారా.. కేసీఆర్, రేవంత్ రెడ్డి దొందూ దొందే..మాజీ మంత్రి కేటీఆర్‌కు కొంచెమన్నా సిగ్గుందా.. గ్రూప్-1 ఉద్యోగులకు బ్రాండ్ అంబాసిడర్ లాగా ఫోజ్ ఇస్తున్నావా. 30 లక్షల నిరుద్యోగుల ఉసురు కేసీఆర్‌కే తగులుతుంది. కేసీఆర్, కేటీఆర్‌లను ఎవరూ నమ్మరు. నేనూ అశోక్ నగర్‌కు వెళ్తా. నిరుద్యోగుల కంటే నాకు కేంద్ర మంత్రి పదవి ఎక్కువ కాదు' అని బండి సంజయ్ అన్నారు.

# ఆర్ అండ్ బి రోడ్డు ఎక్కిన పిచ్చి చెట్ల పోదలు
### మండలంలో ఆర్ అండ్ బి శాఖ ఉన్నట్లా..? లేనట్లా...!
### డంపింగ్ యార్డ్ గా మారిన ఆర్ అండ్ బి రోడ్డు.





**కల్లూరు -ప్రభాత సూర్యుడు** మండల పరిధిలో గల ఎన్టీఆర్ జిల్లా తిరువూరు క్రాస్ రోడ్డు లో ఆహార భద్రతా గోదాం దాటిన తరువాత నుండి రోడ్డు కి ఇరు వైపులా డంపింగ్ యార్డ్ గా మారుతున్న వైనం. చెత్త మరియు వ్యర్థలాను సెప్టిక్ వాటర్ ని సెప్టిక్ ట్యాంకర్ ద్వారా తీసుకోని వచ్చి మారుతీ నగర్ సమీపంలో వదులుతున్న గుర్తు తెలియని సెప్టిక్ ట్యాంకర్ వాహన దారులు. అలాగే షుగర్ ఫ్యాక్టరి దాటిన తరువాత ఆర్ అండ్ బి రోడ్డు మలుపు వద్దనుండి చిల్లంపల్లి చెరువు కు వెళ్లే నాగార్జున సాగర్ పంట కాలవ వరకు రోడ్డు ఎక్కిన పిచ్చి మొక్కలు చెట్లు ఏదైనా వాహనాలు వస్తున్నపుడు టూ వీలర్ వాహన దారులు కానీ సైకిలిస్ట్ కానీ ఆర్ అండ్ బి రోడ్డు సైడ్ దిగితే పోదల్లోకి వెళ్లి పడి ప్రమాదాలు కొని తెచ్చుకునే పరిస్థితి.పంట పొలాలలో గుర్తు తెలియని సెప్టిక్ ట్యాంకర్ ద్వారా తీసుకోని వచ్చిన సెప్టిక్ నీటిని పంట పొలాలలో వదిలి వెళుతున్న వాహన దారులు రోడ్డు పైన వెళ్లే వాళ్ళు దుర్గంధం వేద జల్లుతుంది ఆ సెప్టిక్ నీటి వల్ల వరి పంట ఎండి పోయింది. ఇక ఆర్ అండ్ బి రోడ్డు విష్యానికి వస్తే గుంతలు తో దారుణంగా తయారు అయ్యింది వాహన దారులకు మృత్యు సెకటంగామారింది కనీసం ప్యాచ్చి వర్క్ లు చేసి ఆర్ అండ్ బి శాఖ నాదు లే కనిపించడం కరువైంది.

# పేదల పాలిట కల్ప వృక్షంలా ఎండిఆర్ ఫౌండేషన్
### ఆపన్న హస్తంలా ప్రతి నెలా నిత్యావసర సరుకుల పంపిణీ
### నిరుపేదలకు బాసటగా మాదిరి దేవేందర్ రాజు దాతృత్వం




వృద్ధురాలికి నిత్యావసర సరుకులను అందజేస్తున్న ఎండిఆర్ ఫౌండేషన్ అధిపతి మాదిరి దేవేందర్ రాజు



ఫౌండేషన్ చైర్మన్ మాదిరి దేవేందర్ రాజుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న లబ్ధిదారులు

**పటాన్ చెరు - ప్రభాత సూర్యుడు:** రెక్కాడితే డొక్కాడని నిరుపేదల పాలిట కల్పవృక్షంలో ఎండిఆర్ ఫౌండేషన్ అండగా నిలుస్తోంది. ఎండిఆర్ ఫౌండేషన్ చైర్మన్ మాదిరి దేవేందర్ రాజు ఆధ్వర్యంలో ప్రతినెల నిత్యవసర సరుకులను పంపిణీ చేస్తున్నారు. శుక్రవారం పటాన్చెరు పట్టణ కేంద్రంలో నెలకు సరిపడా నిత్యావసర సరుకులను పేదలకు అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ మాదిరి దేవేందర్ రాజు మాట్లాడుతూ..ఒక్క పూట తిండి కూడా లేక ఆకలితో అలమటిస్తున్న నిరు పేదలకు అండగా నిలుస్తూ ముందుకెళ్తున్నామని పేర్కొన్నారు. పేదలకు, వృద్ధులకు, వితంతు మహిళలకు, అనాథ చిన్నారులకు అండగా నిలుస్తూ మాదిరి దేవేందర్ రాజు చేస్తున్న సేవలను పలువురు ప్రశంసిస్తున్నారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# బండి సంజయ్‌తో గ్రూప్-1 అభ్యర్థుల భేటీ

## తమకు అండగా నిలవాలని వినతి



**కరీంనగర్, అక్టోబర్ 18 (ప్రభాత సూర్యుడు):** గ్రూప్-1 పరీక్షలను రీషెడ్యూల్ చేయాలని ఆందోళనకు దిగిన అభ్యర్థులపై కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై కేంద్రమంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రూప్-1 అభ్యర్థులు పలువురు కరీంనగర్‌లోని బండి సంజయ్ నివాసానికి వెళ్లి కలుసుకున్నారు. మెయిన్స్ పరీక్షలను వాయిదా వేయడంలో తమకు సాయం చేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా గ్రూప్స్ అభ్యర్థుల ఆందోళనకు ఆయన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. గ్రూప్-1 అభ్యర్థులపై లాఠీచార్జ్ చేయడం దారుణమని బండి సంజయ్ అన్నారు. న్యాయం కోరితే రక్తం కళ్లజూస్తారా అని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లకు జీవో 29 గొడ్డలి పెట్టు అని ఆయన వ్యాఖ్యానించారు. గ్రూప్ ? 1 అభ్యర్థుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాక్షసంగా వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రూప్ -1 పరీక్షలను రీషెడ్యూల్ చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. అశోక్ నగర్ నుంచి ఉద్యమం తెలంగాణ అంతా వ్యాపిస్తుందని హెచ్చరించారు. సమస్య తీవ్రం కాకముందే ప్రభుత్వం దిగిరావాలని సూచించారు. బీజేపీ రాష్ట్ర నాయకత్వం అదేశాల మేరకు అశోక్ నగర్ వెళ్లి గ్రూప్-1 అభ్యర్థులను కలుసుకుంటానని చెప్పారు.

# ద్వారకా తిరుమలలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

## రాజమన్నార్ అలంకరణలో దర్శనమిచ్చిన స్వామి

ఏలూరు జిల్లాలోని లోని ప్రముఖ పుణ్య క్షేత్రం ద్వారకా తిరుమల చిన తిరుపతిలో ఆశ్వయుజ మాస బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. 6 వ రోజు శు క్రవారం చిన వెంకన్న రాజమన్నార్ అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నారు. అలాగే రాత్రి 7 గంటలకు స్వామి వారి రథోత్సవం జరగనుంది.కాగా ద్వారకా తిరుమలలో ఏడాదిలో రెండు సార్లు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఒకసారి వైశాఖమాసంలో, మరోసారి అశ్వయుజ మాసంలో స్వామివారికి వైభవంగా బ్రహ్మోత్సవాలు జరుపుతారు. ఈ బ్రహ్మోత్సవాలను ఎనిమిది రోజులపాటు ఘనంగా నిర్వహిస్తారు. శుక్రవారం ద్వారకా తిరుమలలోని మాఢ వీధుల్లో స్వామివారి రథోత్సవం నిర్వహిస్తారు. అశ్వయుజ మాస బ్రహ్మోత్సవాలు జరిగే 8 రోజులపాటు వివిధ వాహనాలపై స్వామి, అమ్మవార్లు భక్తులకు దర్శనం ఇస్తారు. కాగా శనివారం ఉదయం ఏడు గంటలకు చక్రస్నానం, రాత్రి ఏడు గంటలకు శ్రీవారి ధ్వజావరోహణ కార్యక్రమాలు జరుగుతాయి.కాగా గురువారం చిన వెంకన్న కల్యాణం తంతును అర్చకులు వైభవంగా నిర్వహించారు. సర్వాభరణ భూషితుడై, పెండ్లి కుమారుడిగా సర్వజగరకుడైన శ్రీవారు. బుగ్గన దుక్కలతో సిగ్గులొలుకుతున్న అలివేలు మంగ ఆండాళ్. దేవేరులను పరిణయమాడారు. ఈ కల్యాణ ఘడియలో స్వామి చిన్న మంగళ స్వరూపాన్ని వీక్షించి భక్తులు తరించారు. ఈ బద్భుత దృశ్యం ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం రాత్రి ఆవిష్కృతమైంది. తొలుత రాత్రి తొక్కు వాహనంపై శ్రీవారు,అమ్మవార్ల కల్యాణమూర్తులను, ఉంచి అలంకరించి ఆట అనివేటి మండపంలో ఏర్పాటు. చేసిన వేదిక దగ్గరకు తీసుకొన్ని అక్కడ బంగారు సింహాసనంపై కళ్యాణమూర్తులను ఉంచి అర్చకులు కళ్యాణ తంతును ప్రారంభించారు. పాంచాహ్నిక దీక్షతో వైఖానస ఆగమాన్ని అనుసరించి జరిగిన ఈ కల్యాణ తంతులో ఆలయ అర్చకులు ముందుగా శాంతి హోమాన్ని చేసి సర్వదేవతారాధన. సంకటం, కరణ పూజలు నిర్వహించారు. దేవస్థానం తరపున ఆలయ చైర్మన్ రాజా ఎస్వీ సుధాకరరావు ప్రభుత్వం తరపున గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు స్వామి అమ్మ వార్లకు పట్టువస్త్రాలు అందించారు. ఆ తర్వాత అర్చకులు స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న చైర్మన్ సుధాకరరావు, ఎమ్మెల్యే మద్దిపాటి, ట్రస్ట్ విద్యుతరావు మూర్తులకు మధువర్యాలను సమర్పించారు సుముహూర్త సమయంలో నూతన వధూవరుల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ధరింపచేసి భక్తుల గోవిందనామ స్మరణల నడుమ మాంగల్య చారణ, తలంబ్రాలు వైభవోపేతంగా జరిపించారు. అలందు ఈవో ఎస్వీఎస్ఎన్ మూర్తి కల్యాణ ఏర్పాట్లను పర్యవేక్షించగా, ఈఈ భాస్కర్ పాల్గొన్నారు.

# ఉపాధి రంగాలను బలోపేతం చేయాలి!

తెలుగు రాష్ట్రాల్లో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉంది. సమస్య కొండంతగా ఉంటే చర్యలు మాత్రం గోరంత అన్నచందంగా ఉన్నాయి. మరోవైపు ఐటి కంపెనీల్లో తీసివేతలు పెరుగుతున్నాయి. స్కిల్ లేకపోవడం వల్లనే అని తెలంగాణ సిఎం రేవంత్ ఇటీవలే ప్రకటించి, స్కిల్ వర్సిటీకి పునాది వేశారు. నిజానికి క్షేత్రస్థాయి లోనే విద్యారంగంలో మార్పులు రావాలి. విద్యార్థులు రాటుదేలేలా తర్ఫీదు ఇవ్వాలి. వారు ఎంచుకంటున్న ఆయా రంగాల్లో నిష్ణాతులను తయారు చేయాలి. అప్పుడే వారు ఏ పరిశ్రమలో అయినా రాణిస్తారు. అది ఓ పక్క జరుగుతుండగానే ఉన్న నిరుద్యోగులకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించాలి. ఉద్యోగమంటే కేవలం ప్రభుత్వ ఉద్యోగమే కాదు.. ప్రైవేట్ రంగంలోనూ వారికి అవకాశాలు కల్పించాలి. అలాగే సొంతకాళ్ల మీద నిలబడేలా ఉపాధికి అవకాశాలను పెంచాలి. బ్యాంకులు ఇతోధికంగా రుణాలు ఇచ్చేలా చేయాలి. ఇవన్నీ సాకారం కావాలంటే వ్యవసాయరంగం, అనుబంధ రంగాలు బలపడాలి. పారిశ్రామిక రంగం పురోగమించాలి. ఇవన్నీ కూడా యుద్ధప్రాతిపదికన సాగాలి. యువత ఆకాంక్షల మేరకు అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వాలు కృషి చేయాలి. ఎందుకంటే ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కొత్త ప్రభుత్వాలపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కొత్త ప్రభుత్వం వచ్చింది కాబట్టి నిరుద్యోగుల్లో ఆశ పెరిగింది. కొత్తగా పరిశ్రమలు వస్తాయి. తమకు ఉద్యోగాలు వస్తాయని ఎదురు చూస్తున్నారు. టిడిపి ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధి విషయంలో గత ప్రభుత్వంతో పోల్చినపుడు కొంత మెరుగుగా పనిచేస్తోంది. ఇప్పటికే తెలంగాణలో సిఎం సహా మంత్రులు అమెరికా తదితర దేశాలు చుట్టివచ్చారు. పరిశ్రమల ఏర్పాటుకు ఆహ్వానాలు పలికారు. ఎపి మంత్రి లోకేశ్ త్వరలో అమెరికా వెళ్లనున్నారు. పారిశ్రామక వేత్తలకు చంద్రబాబ కూడా రెడ్ కార్పెట్ పరిచారు. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' ఎపుడో వచ్చింది. ప్రభుత్వ ఖజానాలో కొంత ప్రైవేటుకు ఇచ్చి ప్రభుత్వ రంగ బ్యాంకుల చేత రుణాలు ఇప్పించిన తరువాత ప్రైవేట్ కంపెనీలు వేసే రోడ్లు, విమానాశ్రయాలు, చేసే విద్యుత్తు ఉత్పత్తి తదితర మౌలిక సౌకర్యాలు ఎవరికి



అందుబాటులో ఉన్నాయి? ఎవరి మీద భారాలు పడుతున్నాయన్నది ఆలోచించాలి. పన్నులు సరళీకరణ సాగాలి. చిన్నచిన్న పనులను పెంచాలి. కంపెనీలకు మేలు చేసేలా నిర్ణయాలు ఉండరాదు. ప్రజలకు మేలు చేసేలా విధానాలు ఉండాలి. ఎస్.ఇ.జెడ్ లలో వచ్చిన కంపెనీలకు భూములు ఇచ్చి రైతులు ఆ కంపెనీల్లో కూలీలుగా మారారు. పరిశ్రమల నిర్మాణ సమయంలో వచ్చే, పోయే లారీల్లో దింపుడు, ఎత్తుడు హమాలీలయ్యారు. కోల్‌కొతా- చెన్నరు రహదారి పక్కన తమిళనాడు సరిహద్దులో ఉన్న పేరు మోసిన ఎస్.ఇ.జెడ్.లో భూములు కోల్పోయిన రైతులు గతిలేక ఎస్.ఇ.జెడ్ భూముల్లోకి గొడ్లు రాకుండా చూసుకునే కూలీలుగా మారడానికి కూడా సిద్ధపడుతున్నారు. గంగవరం పోర్టులాంటి వాటికోసం, విశాఖ ఉక్కు కోసం భూములు త్యాగాలు చేసిన వారు ఏమవుతున్నారు. ఈ దిశగా ప్రభుత్వాలు ఆలోచన చేయాలి. తెలంగాణలో మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ లాంటి వాటికి భూములు ఇచ్చిన రైతులు ఇవాళ దిక్కులేకుండా పడివున్నారు. ఇలాంటి అభివృద్ధి ఎవరి కోసమన్నది కూడా ఆలోచన చేయాలి. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఎస్.ఇ.జెడ్ లో ఉన్న ఒక కంపెనీలో భూములు ఇచ్చిన రైతు కుటుంబాలకు చెందిన 70 శాతం మంది కార్మికులుగా చేరారు. కానీ 12 సంవత్సరాల తర్వాత కూడా కంపెనీ వారిని కార్మికులుగా కూడా గుర్తించడంలేదు. నైపుణ్యాన్ని బట్టి వేతనాలు ఇవ్వలేదు. కంపెనీ చేసిన ఆర్థిక తప్పిదానికి ప్రస్తుతం మూతపడింది. భూములు ఇచ్చిన కార్మికుల రెక్కలు ముక్కలయ్యాయి.ప్రజల భాగస్వామ్యం ఉన్నా ఏమీ మెరుగ్గా ఒరగబెడుతుందో ప్రభుత్వం చెప్పాలి. నిజంగా చెప్పాలంటే ప్రభుత్వాలు ఏకపక్షంగా పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే పని చేస్తున్నాయి. యూనియన్లు పెట్టుకోనివ్వటం లేదు. అలా ముందుకు వచ్చిన వారిని ఉద్యోగాల నుండి తొలగిస్తున్నారు. ప్రైవేట్ పరిశ్రమల్లో గుర్తింపు ఎన్నికలు మూలపడ్డాయి. తనిఖీలను ఎత్తివేశారు. కార్మికుల భద్రతను గాలికొదిలేశారు. అంటే వెట్టి చాకిరీ చేయించుకునే వ్యవస్థను ప్రభుత్వమే ప్రోత్సహిస్తోందని అర్థం చేసుకోవాలి. నీస వేతన చట్టం ప్రకారం 5 సంవత్సరాలకు ఒకసారి కార్మికులు వేతనాలు పెంచాలి. ఆయా కంపెఈల్లో వేతనాలను కూడా నైపుణ్యాలకు తగినట్లుగా ఇవ్వటం లేదు. అదానీ పోర్టులో కూడా ఇదే పరిస్థితి. కార్మికులను కదలకుండా చేయటానికి పోర్టుల్లో, ఎస్.ఇ.జెడ్ లలో పోలీసు స్టేషన్లు వచ్చాయి. యూనియన్లకు ప్రవేశం లేదు. విడివిడిగా ఉండే ప్రైవేట్ పరిశ్రమలన్నింటిలో కూడా ఇదే పరిస్థితి. అంటే భూములతో పాటు అన్ని వసతులు కల్పిస్తే లాభపడుతున్నది కేవలం పరిశ్రమల యజమానులే తప్ప ప్రజలు కాదని ప్రభుత్వాలు గుర్తించాలి. ఇలాంటి పరిస్థితులు కల్పించే కంపెనీలను దగ్గరకు రాకుండా చూడాలి. ప్రభుత్వమైనా ఆ పథకం ఇస్తాం, ఈ పథకం ఇస్తామని మభ్యపెడుతున్నాయి తప్పిస్తే కార్మికులకు వేతనాలు పెంచుతాం, కార్మిక హక్కులను కాపాడతామని చెప్పటం లేదు. నిజానికి పరిశ్రమలు పెట్టేది ప్రజలకు ఉదద్యోగ ఉపాధి అవకాశాలు పెంచడానికే అని గుర్తించాలి. పెత్తందార్లను తయారు చేసి ప్రజలను వెట్టి చాకీరీ చేయించుకోవడానికి కాదని ప్రభుత్వాలు గుర్తించాలి. అలాంటి వారి కోసం రైతులు ఎందుకు భూములు త్యాగం చేయాలి. ఎందుకు కూలీలుగా మారాలి అన్నది గుర్తించాలి. అలాకాకుండా భూముల్లో బంగారం పండించేలా రైతులను ప్రోత్సహించాలి. వ్యవసాయ అనుబంధరంగాలను ప్రోత్సహించాలి. పర్యావరణం కూడా పరిగణనలోకి తీసుకోవాలి. అలా చేస్తేనే ఉపాధి ఉద్యోగ రంగాలు బలపడతాయని గుర్తించాలి.

# అంబేద్కర్‌ను విస్మరించిన జమిలి!

జమిలి ఎన్నికలపై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ చేసిన ప్రతిపాదనలకు ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్ర క్యాబినెట్ ఇటీవల సూత్రప్రాయంగా ఆమోదించింది. అయితే, ఆశ్చర్యకరమైన విషయమేమంటే.. కమిటీ నివేదికను ఆమోదిస్తూ భారత ప్రభుత్వం అంగీకారం తెలిపేముందు ఉండాల్సిన ఏకాభిప్రాయాన్ని మోదీ సర్కార్ విస్మరించింది. ఇదెలా ఉన్నదంటే.. గుర్రం కంటే ముందే బండిని కొన్నట్టు ఉన్నది.

ఒకవేళ రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ గనుక బతికి ఉంటే.. సదరు కమిటీకి భారత మాజీ రాష్ట్రపతి నాయకత్వం వహించడం, ఏకకాలంలో పార్లమెంట్, రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు నిర్వహించాలన్న ఆ కమిటీ సిఫారసులను కచ్చితంగా వ్యతిరేకించేవారు. ఆర్థిక వ్యయాలు, పరిపాలనా సౌలభ్యాలను మాత్రమే కారణాలుగా చూపుతూ కోవింద్ కమిటీ సమర్థిస్తున్న ఏకకాల ఎన్నికలు.. చట్టసభలకు ప్రభుత్వాల జవాబుదారీతనం విషయంలో ఇప్పటికే వేగంగా పడిపోతున్న ప్రమాణాలను ఏ విధంగా పెంచుతాయో వివరించలేదని ఆందోళన వ్యక్తం చేసేవారు. 'పార్లమెంటరీ ప్రజాస్వామ్య ప్రభుత్వం వైపే రాజ్యాంగ నిర్మాతలు మొగ్గుచూపారు. ఎందుకంటే, చట్టసభలకు ప్రభుత్వాలు జవాబుదారీతనంపై ఇది ఆధారపడి ఉంటుంది' అని రాజ్యాంగ అసెంబ్లీలో అంబేద్కర్ పేర్కొన్నారు.

'కాన్‌స్టిట్యూషనల్ ఫౌండేషన్ ఆఫ్ వన్ నేషన్, వన్ ఎలక్షన్' పేరిట కమిటీ సభ్యుడు సుభాష్ కశ్యప్ సమర్పించిన పేజీలో ఉన్న 'అధ్యక్ష, పార్లమెంటరీ వ్యవస్థల కలయిక భారత రాజ్యాంగం' అన్న విషయం ఆశ్చర్యం కలిగించింది. అంబేద్కర్ పేర్కొన్న జవాబుదారీతనం అనే అంశానికి ఇది పూర్తి విరుద్ధం. గత పదేండ్ల మోదీ పాలనలో పార్లమెంట్‌కు ప్రభుత్వ జవాబుదారీతనం పూర్తిగా క్షీణించింది.

అన్నదాతలను సంప్రదించకుండానే రైతు చట్టాలను చేసి, వాటిని ఉభయసభల్లో ఏకపక్షంగా ఆమోదించడమే (అది కూడా వాయిస్ ఓటింగ్ పద్ధతిలో) అందుకు నిదర్శనం. 2014-24 మధ్యకాలంలో ఆమోదం పొందిన పలు బిల్లులను పరిశీలించవద్దని పార్లమెంటరీ కమిటీలకు మోదీ సర్కార్ ఆదేశించడం దిగ్భ్రాంతికరం. ఈ నేపథ్యంలో చట్టసభలకు ప్రభుత్వం జవాబుదారీతనం



విషయంలో రోజురోజుకు పాతాళంలోకి పడిపోతున్న ప్రమాణాలను ఏకకాల ఎన్నికలు ఎలా పెంచుతాయన్న అంశాన్ని కోవింద్ కమిటీ వివరించలేదు. ఇంకా చెప్పాలంటే ఈ విషయాన్ని ఉద్దేశపూర్వకంగానే విస్మరించింది. ఈ అంశానికి సంబంధించి ఏమైనా సిఫారసులు ఉన్నాయేమోనని వెతకగా.. ఒక్కటి కూడా కనిపించలేదు. రాజ్యాంగ రక్షణకు పాటుపడతానని ప్రమాణం చేసి, దేశంలోని అత్యున్నత పదవిని అధిష్ఠించిన ఒక మాజీ రాష్ట్రపతి నేతృత్వం వహించిన కమిటీ.. పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి అతి కీలకమైన ఈ అంశాన్ని విస్మరించడాన్ని చూసి అంబేద్కర్ కూడా ఆందోళన చెందేవారు. సంప్రదింపుల పేరిట కమిటీ కలిసినవారిలో ఏ ఒక్కరూ 'జవాబుదారీతనం' అంశాన్ని లేవనేత్తలేదు. అంతేకాదు, అవిశ్వాస తీర్మానంపై ఈ కమిటీ పరస్పర విరుద్ధమైన అభిప్రాయాలను వ్యక్తం చేయడం గమనార్హం. ఒకచోట తప్పుబట్టిన కమిటీ.. 'అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం సభ్యుడి హక్కు మాత్రమే కాదు, తన బాధ్యత కూడా' అని మరో చోట పేర్కొన్నది.

అవిశ్వాస తీర్మాన నిబంధనను సవరించాలని లోక్‌సభ మాజీ జనరల్ సెక్రెటరీ సుభాష్ సీ కశ్య ప్ సూచించారు. అవిశ్వాస తీర్మానంలోనే తదుపరి ప్రభుత్వాధినేత ఎవరనేది కూడా సూచించాలని ఆయన తన నివేదికలో పేర్కొన్నారు. దీనికోసం రాజ్యాంగాన్ని సవరించాల్సిన అవసరం లేదని, చట్టసభల నిబంధనలను సవరిస్తే సరిపోతుందని ఉచిత సలహా కూడా ఇచ్చారు. ఎంతో సున్నితమైన ఈ సూచనను జర్మనీ రాజ్యాంగం నుంచి కశ్యప్ తీసుకున్నట్టు తెలుస్తున్నది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యపు ప్రధాన లక్షణమైన 'జవాబుదారీతనం' క్షీణతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నప్పటికీ, దాన్ని కోవింద్ కమిటీ ఉద్దేశపూర్వకంగానే విస్మరించిందని చెప్పడంలో ఎలాంటి సంశయం లేదు. అంతేకాదు, అంబేద్కర్ దార్శనికతను, పార్లమెంటరీ ప్రజాస్వామ్య ప్రాతిపదికను ఇది పూర్తిగా తుంగలో తొక్కింది. అందువల్ల ఈ నివేదిక తిరస్కరణకు అర్హమైనదని చెప్పడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు.



# నవంబర్ 28 నుంచి పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు

నవంబరు 28 నుంచి డిసెంబర్ 6వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని టీటీడీ జేఈవో వీరబ్రహ్మం అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన అధికారులతో కలిసి అమ్మవారి ఆలయం, పుష్కరిణి, మాడవీధులు తదితర ప్రాంతాలను పరిశీలించారు. జేఈవో మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు అమ్మవారి మూలమూర్తి దర్శనంతో పాటు వాహన సేవలు వీక్షించేలాఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. బ్రహ్మోత్సవాలలో చివరిరోజైన పంచమి తీర్థం నాడు విశేషంగా వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్ కోసం పూడి రోడ్డు, రేణిగుంట, మార్కెట్ యార్డ్ ప్రాంతాల్లో స్థలాలను సిద్ధం చేయాలన్నారు.

భక్తులు సేదతీరేందుకు నవజీవన్ కంటి ఆసుపత్రి, హైస్కూలు, గోశాల(పూడి రోడ్డు) వద్ద జర్మన్ షెడ్లు ఏర్పాటు చేయాలన్నారు. తమిళనాడు భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున తమిళంలో సైన్ బోర్డులు సిద్ధం చేయాలన్నారు. టీటీడీ సీవీఎస్వో శ్రీధర్ మాట్లాడుతూ అమ్మవారి బ్రహ్మోత్సవాలలో భద్రతాపరంగా భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా స్థానిక పోలీసులతో సమన్వయం చేసుకొని పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. క్యూలైన్లు, పుష్కరిణి వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. తిరుమల నుంచి పసుపు ఊరేగింపు మార్గాలను ముందే పరిశీలించి ఆ మార్గంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# 20న వారణాసిలో ప్రధాని పర్యటన



## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

**వారణాసి, అక్టోబర్ 18 (ప్రభాత సూర్యుడు):** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అక్టోబర్ 20న తన సొంత పార్లమెంటరీ నియోజకవర్గమైన వారణాసిలో పర్యటించనున్నారు. సుమారు ఆరు గంటలపాటు కాశీలోనే బస చేయనున్నారు. ఉత్తరాదిన పెద్ద పండుగగా జరుపుకునే దీపావళి పర్వదినానికి కొద్ది రోజుల ముందే వారణాసితో సహా దేశవ్యాప్తంగా రూ. 3,254.03 కోట్ల విలువైన ప్రాజెక్ట్‌లను చేపట్టనున్నారు. రూ.380.13 కోట్లతో 15 ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం, రూ.2,874.17 కోట్లతో రెండు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. వారణాసి పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ సిగ్రా స్పోర్ట్స్ స్టేడియంలో బహిరంగ సభలో కూడా ప్రసంగిస్తారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వారణాసి నుంచే దేశంలోని 6 విమానాశ్రయాలను అభివృద్ధి చేసే ప్రాజెక్టులను ప్రారంభిస్తారు. బాగ్‌డోగ్రా (బెంగాల్), దర్భంగా (బీహార్), ఆగ్రా (యూపీ) విమానాశ్రయాల్లో కొత్త సివిల్ ఎన్‌క్లేవ్‌ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. వాటి అంచనా వ్యయం రూ.3,041 కోట్లు. ఇది కాకుండా, రేవా ఎయిర్‌పోర్ట్‌లో కొత్త టెర్మినల్ బిల్డింగ్ నిర్మాణం, మా మహామాయ ఎయిర్‌పోర్ట్ అంబికాపూర్‌లో కొత్త టెర్మినల్ బిల్డింగ్ నిర్మాణం, సర్సావా ఎయిర్‌పోర్ట్‌లో సివిల్ ఎన్‌క్లేవ్ నిర్మాణ ప్రాజెక్టులను ఆయన వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారు. వీటి కోసం రూ.255.18 కోట్లు ఖర్చు చేయనున్నారు.

# స్కిల్ వర్సిటీకి అదానీ గ్రూప్ భారీ విరాళం

## వందకోట్ల చెక్కును స్వయంగా అందించిన అదానీ

### హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌ను కలిసి అందచేత



**హైదరాబాద్, అక్టోబర్ 18 (ప్రభాత సూర్యుడు):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి అదానీ గ్రూప్ భారీ విరాళం ప్రకటించింది. అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ శుక్రవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి రూ.100 కోట్ల చెక్కును అందజేశారు. సీఎస్ శాంతి కుమారి, పురపాలక ముఖ్యకార్యదర్శి దానకిశోర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. యువతకు నైపుణ్యాలు నేర్పించేలా రంగారెడ్డి జిల్లాలో ముచ్చర్లలోని బేగరికంచెలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ఈ వర్సిటీకి శంకుస్థాపన చేశారు. దీనికి మహీంద్రా గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రాను ఛైర్మన్‌గా నియమించారు. 17 రకాల కోర్సుల్లో యువతకు శిక్షణ ఇచ్చి ప్రైవేటు సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ఏటా లక్షమందికి శిక్షణ ఇచ్చేలా రాబోయే కాలంలో ఈ వర్సిటీని విస్తరించనున్నారు. బేగరికంచెలో సొంత భవనం పూర్తయ్యే వరకు గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా భవనంలో వర్సిటీ కార్యకలాపాలు కొనసాగనున్నాయి. ఈ ఏడాది నుంచే ప్రవేశాలు కల్పించే ఉద్దేశంతో ఇప్పటికే దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. నవంబరు 4వ తేదీ నుంచి స్కిల్ యూనివర్సిటీలో కోర్సులు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతానికి ప్రాధాన్యం ఉన్న ఆరు కోర్సులతో మొదలు పెట్టి క్రమంగా కోర్సులను పెంచనున్నారు. ఈ వర్సిటీకి ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్‌మహీంద్రా ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం దీనికోసం వందకోట్లు కేటాయించింది. ఈ క్రమంలో అదానీ గ్రూప్ చైర్మన్ గౌతం అదానీ నేతృత్వంలో ఓ ప్రతినిధులు బృందం శుక్రవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలుసుకుంది. తెలంగాణలో స్కిల్స్ యూనివర్శిటీని ఏర్పాటు చేయడానికి తెలంగాణ ప్రభుత్వానికి రూ. 100 కోట్లను విరాళంగా ఇచ్చారు. దానికి సంబంధించిన చెక్కును అదానీ సిఎం రేవంత్ రెడ్డికి స్వయంగా అందజేశారు. లాజిస్టిక్స్ అండ్ ఈ-కామర్స్, హెల్త్‌కేర్, స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్స్ అండ్ లైఫ్ సైన్సెస్ అడ్మిషన్ పక్రియ పూర్తైంది. టీచింగ్ సైతం నడుస్తోంది. ఈ సందర్భాంగా తెలంగాణ సీఎం ఎక్స్‌లో ట్వీట్ చేశారు. 'అదానీ గ్రూప్ సంస్థల ఛైర్మన్ శ్రీ గౌతమ్ అదాని గారు మర్యాదపూర్వకంగా కలిశారు. అదానీ ఫౌండేషన్ నుంచి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి రూ.100కోట్ల విరాళం చెక్కు రూపంలో అందజేశారు.' అని ముఖ్యమంత్రి ట్వీట్‌లో పేర్కొన్నారు.



# శ్రీవారి భక్తులకు శుభవార్త


## జనవరి ఆర్జిత సేవా టిక్కెట్లు

## నేడు విడుదల చేయనున్న టిటిడి

**తిరుమల అక్టోబర్ 18 (ప్రభాత సూర్యుడు):** ప్రపంచవ్యాప్తంగా తిరుమల శ్రీవారికి కోట్లాది మంది భక్తులున్నారు. వారంతా ఏడాదిలో ఏదో ఒక రోజులో.. ఆయన్ని దర్శించుకునేందుకు తిరుమలకు తరలి వస్తారు. ఆ క్రమంలో భక్తుల సౌకర్యార్థం తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) వివిధ చర్యలు చేపట్టింది. వారిని దృష్టిలో ఉంచుకుని శ్రీవారి సుప్రభాత సేవ నుంచి ఏకాంత సేవ వరకు ఉన్న పలు సేవా టికెట్లను టీటీడీ విక్రయిస్తుంది. ఆ క్రమంలో 2025 జనవరికి సంబంధించిన శ్రీవారి ఆర్జిత సేవలు, దర్శన టికెట్ల కోటాను అక్టోబర్‌లో టీటీడీ అందుబాటులోకి తీసుకురానుంది. అందులోభాగంగా తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించి జనవరి కోటాను శనివారం ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) విడుదల చేయనుంది. సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం అక్టోబరు 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకో వచ్చని టీటీడీ ప్రకటించింది. అయితే ఈ టికెట్లు పొందిన భక్తులు అక్టోబర్ 21వ తేదీ నుంచి 23వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించాల్సి ఉంటుందని తెలిపింది. ఇక వారికి లక్కీడిప్‌లో టికెట్లు మంజూరవుతాయని వివరించింది. కళ్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవా టికెట్లను అక్టోబర్ 22న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తామని వివరించింది. వర్షాకాలం కావడంతో.. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. ఇక తిరుమలలో సైతం భారీగా వర్షం పడుతుంది. దీంతో తిరుపతి చుట్టుపక్కన ఆవరించిన ఏడుకొండలు సైతం పచ్చదనాన్ని పరుచుకుంది. ఓ వైపు వరుస సెలవులు రావడం.. వాతావరణం అహ్లాదకరంగా మారడంతో తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా క్యూ కడుతున్నారు.

# బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్‌కు బెదిరింపులు

## 5 కోట్లు డిమాండ్ చేస్తూ పోలీసులకు మెసేజ్



**ముంబై, అక్టోబర్ 15 (ప్రభాత సూర్యుడు):** బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ కు మరోసారి బెదిరింపులు వచ్చాయి. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో ఉన్న వైరానికి ముగింపు పలకాలంటే రూ.5 కోట్లు ఇవ్వాలంటూ అగంతకులు బెదిరింపులకు పాల్పడ్డారు. ముంబయి ట్రాఫిక్ పోలీసుల వాట్సప్ నంబర్‌కు ఈ మెసేజ్ రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. గురువారం రాత్రి ముంబయి ట్రాఫిక్ పోలీసులకు ఈ మెసేజ్ వచ్చింది. 'ఈ బెదిరింపులను తేలిగ్గా తీసుకోవద్దు. సల్మాన్ ఖాన్ ప్రాణాలతో ఉండాలన్నా.. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో శత్రుత్వాన్ని ముగించుకోవాలన్నా ఆయన రూ.5కోట్లు చెల్లించాలి. ఈ డబ్బులు ఇవ్వకపోతే ఇటీవల హత్యకు గురైన మాజీ ఎమ్మెల్యే సిద్ధిఖీ కంటే ఆయన దారుణమైన పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుందని దుండగులు అందులో బెదిరించారు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించామని, మెసేజ్ ఎక్కడినుంచి వచ్చిందన్న దానిపై విచారణ జరుపుతున్నామని ముంబయి పోలీసులు వెల్లడించారు. ఈనేపథ్యంలో బాంద్రాలోని ఆయన నివాసం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. కాగా.. సల్మాన్‌ఖాన్‌కు ఇలా బెదిరింపులు రావడం ఇదే తొలిసారి కాదు. గతంలోనూ పలుమార్లు బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి ఆయనకు బెదిరింపులు వచ్చాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో సల్మాన్ నివాసం ఉంటున్న బాంద్రాలోని గెలాక్సీ అపార్ట్‌మెంట్ వద్ద ఇద్దరు వ్యక్తులు కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే. ఇక, అంతకుముందు పన్వేల్ ఫామ్‌హౌస్‌లోకి చొరబడేందుకు కొందరు ప్రయత్నించడం అప్పట్లో కలకలం రేపింది. నటుడి ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో గతేడాది మహారాష్ట్ర ప్రభుత్వం ఆయనకు భద్రతను పెంచింది. ఇదిలాఉండగా.. సల్మాన్ ఖాన్ స్నేహితుడు, ఎన్సీపీ నేత బాబా సిద్ధిఖీ గతవారం దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. ముంబయిలోని బాంద్రాలో తన కుమారుడి కార్యాలయంలో ఉండగా.. ముగ్గురు దుండగులు సిద్ధిఖీపై మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. వెంటనే ఆయన్ను లీలావతి ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ హత్య తామే చేసినట్లు బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించుకుంది.

# వయనాడ్‌లో రంగంలోకి సిపిఐ అభ్యర్థి

## ప్రియాంకపై పోటీ పడనున్న సత్యన్ మొకెరి

**న్యూఢిల్లీ, అక్టోబర్ 15 (ప్రభాత సూర్యుడు):** వయనాడ్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేయనున్న ప్రియాంక గాంధీ పై సిపిఐ అభ్యర్థిని నిలపనుంది. కేరళలోని వాయనాడ్ నుంచి ప్రియాంక పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే. వామపక్షాలు సీనియర్ సిపిఐ నాయకుడు, మాజీ శాసనసభ్యుడు సత్యన్ మోకెరి(70)ని పోటీకి నిలబెట్టింది. రాహుల్ గాంధీ తన వాయనాడ్ సీటును ఖాళీ చేయడంతో ఆ సీటుకు ఇప్పుడు ఉపఎన్నిక జరుగబోతున్నది. అయితే గమనించాల్సిన విశేషమేమిటంటే ఇది ప్రియాంక గాంధీ తొలిసారి పోటీ చేస్తున్న ఎన్నికల ఘట్టం. సిపిఐ స్టేట్ కౌన్సిల్ గురువారం సమావేశమై సత్యన్ మోకెరి విషయంలో నిర్ణయం తీసుకుంది. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బినయ్ విశ్వం మాట్లాడుతూ ' మోకెరి పూర్తి స్థాయిలో పోటీపడతారు. ఆయన దేశంలో జరిగిన అనేక రైతు ఉద్యమాలకు నాయకత్వం వహించారు. మేము సీనియర్ రైతు నాయకుడిని ఎల్ డిఎఫ్ అభ్యర్థిగా వాయనాడ్ నుంచి నిలబెడుతున్నాము' అన్నారు.మోకెరి ప్రస్తుతం ఆల్ ఇండియా కిసాన్ సభకు జాతీయ కార్యదర్శిగా ఉన్నారు. అది సిపిఐ రైతు విభాగం. పైగా మోకెరి కొజికోడ్ జిల్లాకు చెందిన స్థానిక వాసి. ఆయన 1987 నుంచి 2001 వరకు మూడుసార్లు శాసనసభ్యుడిగా పనిచేశారు. ఆయన నందపురం అసెంబ్లీ సీటు కు ప్రాతినిధ్యం వహించారు. మోకెరి పార్టీ విద్యార్థి విభాగం 'ఆల్ ఇండియా స్టూడెంట్ ఫెడరేషన్' నుంచి పార్టీలో చేరారు. ఆయన 'స్టేట్ అగ్రికల్చరల్ డెట్ రిలీఫ్ కమిషన్' సభ్యుడిగా కూడా పనిచేశారు. మోకెరి 2014లో కూడా వాయనాడ్ నుంచి లోక్ సభకు పోటీ చేశారు. నాడు ఆయన కాంగ్రెస్ సిట్టింగ్ ఎంపీ ఎం.ఐ. షానవాస్ చేతిలో 20870 ఓట్ల తేడాతో ఓడిపోయారు.ఆయన తన ప్రచారం శనివారం నుంచి కొనసాగిస్తానన్నారు. 'వాయనాడ్ ప్రజలు ఎల్లప్పుడూ వామపక్ష ఉద్యమానికి తోడుగా నిలబడ్డారు. మేము రాజకీయ విధానంలోనే ఓటర్ల వద్దకు వెళ్లి ఓట్లడుగుతాము' అన్నారు.







# మూసీపై సిఎం రేవంత్ వ్యాఖ్యలు అర్థరహితం

## చర్చకు తాము సిద్దంగా ఉన్నామన్న హరీష్ రావు

## మల్లన్నసాగర్ బాధితులకు మంచి ప్యాకేజీ ఇచ్చామని వెల్లడి

**హైదరాబాద్, అక్టోబర్ 15 (ప్రభాత సూర్యుడు):** మూసీపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రంగా ఖండించారు. సీఎం రేవంత్ సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. శుక్రవారం మాజీ మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. 'రేవంత్ రెడ్డి సవాలుకు సిద్ధం. రేపు రమ్మంటావా.. ఎల్లుండి రమ్మంటావా. సెక్యూరిటీ లేకుండా వస్తా అన్నావ్. పోదాం పదా. డేట్, టైం మీరే చెప్పండి, కారు డ్రైవింగ్ చేసుకుంటూ ఇద్దరమే పోదాం. లేదంటే రేపు ఉదయం 9 గంటలకు నేను సిద్ధం. ముందు మూసీ నిర్వాసితుల వద్దకు, ఆ తర్వాత ఆర్అండ్ఆర్ కాలని, మల్లన్న సాగర్, రంగనాయక సాగర్ కట్ట మీదకు పోదాం అక్కడే కూర్చొని మాట్లాడుదాం' అంటూ మాజీ మంత్రి సవాల్ విసిరారు. 2013 చట్టానికి మించిన ప్రయోజనాలు మల్లన్న సాగర్ ప్రజలకు ఇచ్చింది బీఆర్ఎస్ పార్టీ అని చెప్పుకొచ్చారు. పేదల ఇళ్లను కూల్చటాన్ని మాత్రమే బీఆర్ఎస్ వ్యతిరేకిస్తోందని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్నటి సీఎం మాటలతో అబద్ధం కూడా ఆశ్చర్యపోయిందన్నారు. ప్రజల దృష్టిని మరల్చడం కోసమే సీఎం రేవంత్ మూసీ అంశాన్ని తీసుకొచ్చా రన్నారు. ఎన్నికల హామీలు నెరవేర్చటంలో కాంగ్రెస్ చతికిలపడిందని విమర్శించారు. నదీ జలాల శుద్ధితో మూసీ నది పునర్జీవ పక్రియ మొదలు పెట్టాలన్నారు. మొదట మూసీ నదిలో వ్యర్థాలు వచ్చి చేరకుండా అడ్డుకోవాలని సూచించారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి స్థాయిని దిగజార్చారని మండిపడ్డారు. మూసీలో గోదావరి నీళ్ళను కలపటానికి డీపీఆర్ కూడా సిద్ధమైందని తెలిపారు. గుజరాత్‌లో కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా రాలేదన్నారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టు అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి కీలక కామెంట్స్ చేశారు. తెలంగాణ భవిష్యత్‌ను నిర్దేశిరచే ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టిందన్నారు. 33 బృందాలు మూసీ పరివాహకంపై అధ్యయనం చేశాయని సీఎం తెలిపారు. మూసీ పరివాహకంలో నివసిస్తున్న వారు దుర్భర పరిస్థితుల్లో ఉన్నారని.. అలాంటి వారికి మెరుగైన జీవితం అందించాలని భావిస్తున్నామన్నారు. విషవలయం లో పేదలు ఉండాలనేది కొందరి ఆలోచన అంటూ విపక్షాలపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు సీఎం రేవంత్. భూగరిష్ట పరిమితి చట్టాన్ని వ్యతిరేకించిన వర్గం కూడా దేశంలో ఉండేదన్నారు. పేదలు ఎప్పుడూ పేదలుగానే ఉండాలని దొరలు, భూస్వాములు భావిస్తారన్నారు. కొందరు ప్రజా ప్రతినిధులు, అధికారులు రాష్ట్రాన్ని దోచుకున్నారని సీఎం ఆరోపించారు. తాము చేపడుతున్నది మూసీ సుందరీకరణ కాదని.. మూసీ నది పునరుజ్జీవన కార్యక్రమం అని చెప్పారాయన. కొందరి మెదడులో మూసీలో ఉన్న మురికి కంటే.. ఎక్కువ విషం నింపుకున్నారంటూ విపక్ష నేతలపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. విషపూరిత ఆలోచనలతోనే మూసీ ప్రాజెక్ట్‌పై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఇదే సమయంలో ప్రతిపక్షాలకు సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ, కిష్టాపూర్ ఎక్కడికైనా.. సెక్యూరిటీ లేకుండా తానువ స్తానని అన్నారు. విపక్ష నేతలు కూడా రావాలని సవాల్ విసిరారు. అక్కడ రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహిద్దామన్నారు.

# పాలన చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వం

## మూసీ చుట్టూ ముఖ్యమంత్రి ప్రదక్షిణం

## ట్విట్టర్ వేదికగా కెటిఆర్ విమర్శలు

**హైదరాబాద్, అక్టోబర్ 15 (ప్రభాత సూర్యుడు):** తెలంగాణ అభివృద్ధి, పాలన చేతకాకే కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి మూసీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పాలన చేతకాకే పనికిమాలిన మాటలు, పాగల్ పనులు చేస్తున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రంలో పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని ఎద్దేవా చేశారు. ఈ మేరకు ట్విటర్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆడలేక మద్దెల ఓడు అన్నట్లు పరిపాలన, అభివృద్ధి చేయడం తెలియక మూసీ మురుగులో కాంగ్రెస్ పార్టీ పొర్లుతోందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆ పార్టీ నేతలు తమకు అంటిన మూసీ బురదను అందరికీ అందించాలని చూస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ ప్రాజెక్టుతోనే హైదరాబాద్ అభివృద్ధి అవుతుందని చెప్పే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తెలుసుకోవాల్సింది చాలా ఉంది. మూసీ ప్రాజెక్టుతో సంబంధం లేకుండానే తలసరి ఆదాయంలో (పర్ క్యాపిటా) తెలంగాణ దేశంలోనే నంబర్ వన్ అయ్యింది. మూసీ ప్రాజెక్టులో రూ.1.50 లక్షల కోట్లు దోచుకోకుండానే జీడీపీ అభివృద్ధిలో రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానం సాధించింది. బిల్డర్లు, రియల్టర్లను బెదిరించకుండానే ఐటీ ఎగుమతుల్లో బెంగళూరును హైదరాబాద్ దాటేసింది. మీ బడే భాయ్ మోదీ ఐటీఐఆర్ ని రద్దు చేసినా, తెలంగాణకు ఒక్క రూపాయీ సహాయం చేయకపోయినా, ఐటీ ఎగుమతుల విషయంలో 2035 నాటికి చేరుకోవాల్సిన టార్గెట్‌ని 11 ఏళ్ల ముందేగానే 2023లో చేర్చిన ఘనత కేసీఆర్ నాయకత్వానిది. ఢిల్లీకి డబ్బు సంచులు పంపకుండానే తెలంగాణ విత్తన భాండాగారమైంది. దేశంలోనే ధాన్య సిరిగా మారింది. పేదల కంట కన్నీరు లేకుండానే పారిస్, బొగొటా, మెక్సికో సిటీ, మోంటేరియల్‌ను అధిగమించి ప్రపంచంలోనే అత్యుత్తమ గ్రీన్ సిటీ అవార్డును హైదరాబాద్ దక్కించుకుంది. మూసీ నదికి అటు ఇటు అభివృద్ధి, ఆకాశ హర్మ్యాలు కడుతున్నప్పుడు మరి ఫోర్త్ సిటీ ఎందుకు?. మూసీ పక్కన పెట్టుబడి పెట్టేందుకు ఫోర్ బ్రదర్స్ మనీ స్పిన్నింగ్ కోసమా?. ఫ్యూచర్ సిటీ అని పొంకణాలు ఎందుకు ?. కుర్చీలో కూర్చుంటేనో, సమావేశాల్లో తల కిందకీ మీదకీ తిప్పితేనో అభివృద్ధి జరగదు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నా అంటూ ప్రభుత్వ బడి పిల్లల పరువు తీయకు. కేసీఆర్ ప్రారంభించిన గురుకులాల్లో చదువుకున్న విద్యార్థులు అద్భుతమైన ఇంగ్లీష్ మాట్లాడతారు. ప్రపంచవ్యాప్తంగా గొప్ప గొప్ప ఉద్యోగాలు చేస్తున్నారు' అని కేటీఆర్ అన్నారు.

Printed, Published and Owned by CHERUKU UPENDER, Printed at Akshaya Printers, H.No:7-83/2, Hanuman Nagar Colony, Kuntloor, Abdullapurmet Mandal, Hayath Nagar, Pin: 501505, Rangareddy District/Hyderabad City, Telangana. Editor: CHERUKU UPENDAR, Publication at HAMSA PUBLICATIONS, H.No: 7-83/2, Hanuman Nagar Colony, Kuntloor, Abdullapurmet Mandal, Hayath Nagar, Pin:501505, Rangareddy District/Hyderabad City, Telangana. E-mail:upendrabbk@gmail.com RNI: TELTEL12215